సాక్షి నిర్మల్

గురువారం । 25 । జూలై । 2024



'విద్యుత్'తో తస్మాత్ జాగ్రత్త

వానాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశముంది. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



బెల్ట్ తీసేదెవరు..?

తానూరు మండలంలో ఊరికో మద్యం దుకాణం (బెల్ట్ షాపు) వెలుస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం తమకేం పట్టదన్నట్లు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.0 /24.0

రోజంతా ఆకాశం మేఘావృతమవుతుంది. అల్ప పీడనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన తైక్వాండో కమిటీ సభ్యులు



పుష్పగుచ్ఛం ఇస్తున్న తైక్వాండో సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: నూతనంగా ఎన్నికైన తైక్వాండో జిల్లా కమిటీ సభ్యులు బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో తైక్వాండో ఆట అభివృద్ధికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందేలా చూడాలన్నారు. కలెక్టర్ కలిసిన వారిలో తైక్వాండో అధ్యక్షులు ధ్యాయత్ సోమేశ్వర్, ధ్యాయత్ అక్షయ్, జాయింట్ సెక్రెటరీ వంశీ, నరేష్ ఉన్నారు.

అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఫైజాన్‌అహ్మద్

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు పట్టిక రిజిస్టర్, ఆరోగ్య స్థితిగతులను తెలిపే రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థుల గైర్హాజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్లో వాస్తవాలను పొందుపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్, సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం



సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులు

సారంగాపూర్: త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి తీరుతామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు జేఎల్, డైట్ లెక్చరర్లుగా పదోన్నతులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. రెండు పెండింగ్ డీఏలు, పాఠశాలల్లో స్కావెంజర్లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణ, రాష్ట్ర బాధ్యులు నర్సయ్య, గంగాసాగర్, పరమేశ్వర్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం..!



దొత్తివాగు దాటుతున్న గిరిజనులు

పెంబి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కడెం, దొత్తి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం మండలంలోని రాంనగర్, యాపలగూడ గ్రామస్తులు నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు పెంబికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దొత్తి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రమాదమని తెలిసినా ప్రవాహంలోంచి నడుచుకుంటూ ఆయా గ్రామాలకు చేరుకున్నారు. దీంతో పాటు కడెం వాగుపై పస్పుల వద్ద మూడేళ్ల క్రితం వంతెన నిర్మాణ చేపట్టి రాకపోకలు ప్రారంభించిన నెలల వ్యవధిలో రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు వంతెన కొట్టుకుపోయింది. దీంతో పస్పుల, హరిచంద్‌తాండ, దయ్యాలమద్ది, తులసీపేట్, తదితర గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికీ వంతెనకు మరమ్మతులు చేపట్టలేదు. వర్షాకాలం వచ్చిందంటే రోజుల తరబడి ఇంట్లోనే పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంటోందని గిరిజనులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దొత్తివాగుపై వంతెన నిర్మించాలని, కడెం వాగుపై వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

చచ్చి.. ఏం సాధిస్తాం..!?

గంగారాం.. వీళ్లకు దిక్కెవరూ!?

'అమాయకపు చూపులతో అల్లారుముద్దుగా ఉన్న ఆ చిన్నారులిద్దరిని చూడు.. ఇప్పటికీ మా నాన్న తిరిగి వస్తాడన్న ఆశతో లింగు (6), లాసు (4) నీకోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. నువ్వు జీవితాంతం తోడుంటానంటే.. నిన్ను నమ్మి వచ్చిన నీ భార్య విమలను ఒంటరిదాన్ని చేశావు. జన్మనిచ్చిన మీ అమ్మకూ కన్నీళ్లే మిగిల్చావు.. నీకెమంత వయసైపోయిందని నీ కుటుంబాన్ని ఇలా రోడ్డున పడేశావు....!?' ఈ ఫొటోను చూస్తే ఇవే ప్రశ్నలు వస్తాయి. చిన్నపాటి కుటుంబ సమస్యలకే చిన్నవయసులోనే నిండు ప్రాణాలు తీసుకున్నాడు కడెం మండలం చిట్యాల్ గోండుగూడకు చెందిన పందిరి గంగారాం (27). పశువుల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే గంగారాం మద్యానికి బానిసై కుటుంబానికి దూరమయ్యాడు. చిన్నపాటి కుటుంబ కలహాలకే క్షణికావేశానికి లోనై.. ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పనిచేసుకుంటూ భర్తకు చేదోడువాదోడుగా ఉండే విమలతో పాటు తన చిన్నారులిద్దరినీ జీవితాంతం బాధపడేలా చేశాడు.



ఇద్దరు పిల్లలతో విమల

- చిన్న కారణాలకే ప్రాణాలు తీసుకుంటూ
- కుటుంబాలను రోడ్డున పడేస్తూ..
- వందరోజుల్లో పదుల సంఖ్యలో..
- సూసైడ్ చేసుకున్న యువత
- జిల్లాలో ఆత్మహత్యల పరంపర

నిర్మల్: చావు.. అంటే అందరికీ భయమే. ప్రాణాల మీదకు వస్తుందంటే ఎవరైనా, ఎంతకైనా తెగించడం సహజం. అలాంటిది చిన్నపాటి సమస్యలు, కలహాలతో ఇప్పుడు చాలామంది తమ నిండు ప్రాణాలను తీసుకుంటున్నారు. 'మనం బతికుంటే.. ఇవ్వాళ కాకపోతే రేపు ఏదైనా చేయొచ్చు. కానీ.. 'చచ్చి.. ఏం సాధిస్తాం..' అన్న కనీస ఆలోచన చేయడం లేదు. తమ క్షణికావేశం, మూర్ఖపు ఆలోచనలతో తమవారిని జీవితాంతం బాధపడేలా చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల వరుసగా జరుగుతున్న ఆత్మహత్యల పరంపర కలవరపెడుతోంది. కేవలం రెండుమూడు నెలల్లోనే పదులసంఖ్యలో ఆత్మహత్యల కేసులు నమోదయ్యాయి. ఇప్పటికీ వారంలో మూడు నాలుగు బలవన్మరణాలు జరుగుతూనే ఉండటం ఆందోళనకరమైన విషయం.

వరుసగా ఆత్మహత్యలు..

కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలు వంటి కారణాలతో పాటు ప్రేమవిఫలమైనా ప్రాణాలు తీసుకున్నారు. చిన్నపిల్లాడు సెల్‌ఫోన్ ఇవ్వకపోతే బలవన్మరణానికి పాల్పడటం గమనార్హం.

- గతనెల 28న నర్సాపూర్(జి) మండలం గొల్లమాడకు చెందిన కోటగిరి గంగయ్య (50)పంట దిగుబడి రాక అప్పుల పాలై మనస్తాపంతో ఉరేసుకుని చనిపోయాడు.
- కడెం మండలం సారంగాపూర్‌కు చెందిన పసుపుల నర్సయ్య గత నెల 28న అప్పులబాధ భరించలేక ఉరేసుకున్నాడు.
- కుంటాల మండలంలోని ఓలాలో బొమ్మెన ప్రకాష్ (36) ఆర్థిక ఇబ్బందులు తాళలేక గత నెల 23న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలను అనాథలను చేశాడు.
- లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌కు చెందిన కుమ్మరి రాజేందర్ (25) గతనెల 26న ఆత్మహత్య చేసుకుని కుటుంబాన్ని రోడ్డున పడేశాడు.
- సారంగపూర్ మండలం బోరిగాంకు చెందిన 13 ఏళ్ల జట్ల రాకేశ్ సెల్‌ఫోన్ ఇవ్వలేదన్న కారణానికే మే 9న ఇంట్లోనే ఉరేసుకుని చనిపోవడం దారుణం.
- సారంగపూర్ మండలం ధనికి చెందిన కొప్పుల లక్ష్మి (51) అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకుంది. గతంలో భర్త కూడా చనిపోవడంతో ఇప్పుడు తల్లిదండ్రులను కోల్పోయిన కుమారుడు అవినాశ్ ఒంటరయ్యాడు.
- సారంగపూర్ మండలం మహావీర్‌తండాకు చెందిన ఆడె రమేశ్ (45) మద్యానికి బానిసై గత నెల 28న ఆత్మహత్య చేసుకున్నాడు.
- భైంసా మండలంలోని టాక్లికి చెందిన తలుపుల రాజు మద్యం మత్తులో గ్రామ నీటిట్యాంకులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన బొడ్డుపల్లి జ్యోత్స్న (27) భర్త ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉండగా.. కుటుంబ కలహాలతో ఇంట్లోనే ఉరేసుకుని ప్రాణం తీసుకుంది.
- ఖానాపూర్ మండలంలోని రాజురాకు చెందిన మహేశ్వర్ నాయక్(18) అనే విద్యార్థి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చదువుపై ఒత్తిడిని తట్టుకోలేక ప్రాణాలనే విడిచిపెట్టడం దారుణం.

మారుతీ.. ఏంటీ వీళ్ల గతి..!?



మారుతి కుటుంబ సభ్యులు

'ఏం మారుతీ.. ప్రాణాలు తీసుకోవాలంటే ఎంతో ధైర్యం కావాలి. అలాంటిది నువ్వు ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్ గద్దెనెక్కి కరెంటు వైరునే పట్టుకుని ప్రాణం తీసుకున్నావు. ఇంతటి ధైర్యమున్న నువ్వు చిన్నచిన్న సమస్యలను ఎదుర్కోలేకపోయావా..!? నీ మరణంతో ఎవరికి మేలు జరిగింది..! నువ్వు చేసిన పనికి నీకుటుంబమంతా పెద్దదిక్కును కోల్పోయింది..' ఈనెల 22న కుభీర్ మండలం సిరిపెల్లి(హెచ్)కి చెందిన జాదవ్ మారుతి (45) పల్సితండా వద్ద కరెంటు వైరును పట్టుకుని మరీ.. ప్రాణం తీసుకున్నాడు. ఆటోడ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునే మారుతి మరణంతో భార్య లక్ష్మి, కుమారుడు, తల్లిదండ్రులు పెద్దదిక్కును కోల్పోయారు.

- కడెం మండలం పాండ్వాపూర్‌కు చెందిన కొట్టే కిరణ్ (28) కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడి, భార్యపిల్లలను అనాథలను చేశాడు.
- దస్తురాబాద్ మండలం గొడిసిర్యాలకు చెందిన పానుగంటి పవన్ (21) ప్రేమ విఫలమైందని పురుగుల మందు తాగి కుటుంబానికి దూరమయ్యాడు.
- కడెం మండలం నవాబ్‌పేట్‌కు చెందిన మేడి కావ్య (29) అనారోగ్య సమస్యలకు ఆత్మహత్య పరిష్కారమనుకుని గతనెల 30న ప్రాణం తీసుకుంది.
- కడెం మండలం పెద్ద బెల్లాల్ గ్రామానికి చెందిన తుప్ప నరేష్ (39) సైతం అనారోగ్య సమస్యలతో ఈ నెల 13న ప్రాణం తీసుకున్నాడు.

ఇలా.. ఇంకా ఎంతోమంది ఈ రెండుమూడు నెలల్లోనే తమ నిండు ప్రాణాలను బలిపెట్టుకున్నారు. తమ ఆత్మను చంపుకుని, తమవారికి తామే దూరమయ్యారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు..



సమస్యలు లేని మనిషంటూ ఎవరూ ఉండరు. చిన్నచిన్న వాటికే ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు. ఇప్పుడు పెద్దది అనుకున్న సమస్యే రేపు చిన్నది కావొచ్చు. క్షణికావేశానికి లోనుకాకుండా విచక్షణతో జీవితాన్ని కాపాడుకోవాలి.

– జానకీ షర్మిల, ఎస్పీ

కౌన్సెలింగ్ అవసరం..



మత్తు పదార్థాలు, కుటుంబ, ఆర్థిక పరిస్థితులు, ఒంటరితనం ఇలాంటివే ఎక్కువగా ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తుంటాయి. ఇలాంటి సమస్యలున్న వారు క్షణికావేశానికి లోను కాకూడదు. సకాలంలో సరైన కౌన్సెలింగ్ తీసుకుంటే మళ్లీ మాములుగా మారవచ్చు.

– ప్రొఫెసర్ డా.విశాల్, న్యూరోసైకియాట్రిస్ట్

ఆ రోడ్లకు మరమ్మతులు..



మున్సిపల్ కార్యాలయం ఎదుట గుంతలు పూడుస్తున్న పొక్లెయినర్

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్: జిల్లా కేంద్రంలో దారుణంగా తయారైన రోడ్లపై ఈ నెల 22న 'సాక్షి' ప్రచురించిన 'ఒక్క రోడ్డూ సక్కగ లేదు..' కథనానికి స్పందించిన అధికార యంత్రాంగం పనులు మొదలుపెట్టింది. తాత్కాలికంగానైనా రోడ్లను బాగు చేసేందుకు బుధవారం మున్సిపల్ యంత్రాంగం పనులు ప్రారంభించింది. స్థానిక బల్దియా ఎదుట చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజు సమక్షంలో గుంతలను పూడ్చే పనులు మొదలు పెట్టారు. ఇదేవిధంగా పట్టణంలో రోడ్లన్నీ బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో శుభ్రత పాటించాలి



భోసి పాఠశాలలో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

తానూరు: గ్రామాల్లో శుభ్రత పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం భోసి, బోరిగాం, జౌలా(కే) గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ఖర్చుచేసిన నిధుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు పరిశీలించారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో అబ్దుల్ సమ్మద్, ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బడుల్లో తీరని సమస్యలు

- వర్షం పడితే తప్పని ఇక్కట్లు
- తిమ్మాపూర్, ఇలేగాం, ఖానాపూర్‌లో శిథిల భవనాలు
- కూలేందుకు సిద్ధంగా పైకప్పులు

సాక్షి ఫోకస్



ఖానాపూర్: శిథిలావస్థలో శాంతినగర్ పాఠశాల



భైంసా: శిథిలావస్థలో తిమ్మాపూర్ పాఠశాల భవనం

భైంసా/ఖానాపూర్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తున్నా బడుల్లో మాత్రం పూర్తిస్థాయిలో సమస్యలు మాత్రం తీరడంలే దు. జిల్లాలో 735 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటి ఆధునికీకరణ, మరమ్మతులకు ప్రభుత్వం రూ.24.96 కోట్లు కేటాయించింది. అమ్మ ఆదర్శ కమిటీలతో అయా పనులు పూర్తి చేయించారు. ఇంకా జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఇబ్బందులు అలాగే ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల వర్షపునీరు బడుల్లోకి వచ్చి చేరుతోంది. భైంసా మండలం ఇలేగాంలో రెండు భవనాలు శిథిలదశకు చేరుకున్నాయి. భవనం పైనుంచి నీరు కిందికి ఉరుస్తోంది. తిమ్మాపూర్‌లోనూ పాఠశాల భవనం శిథిలదశకు చేరుకుంది. దీంతో వర్షాకాలంలో ఇక్కడ చదివే విద్యార్థులకు పక్కనే నిర్మించిన భవనాల్లోకి పంపించి చదువులు కొనసాగిస్తున్నారు.

నడువలేని పరిస్థితి...

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వర్షం కురిస్తే నడువలేని పరిస్థితి కనిపిస్తుంది. భైంసా మండలం మహాగాం పాఠశాల భవనాన్ని గ్రామానికి ఆనుకుని ఉన్న వాగులోనే నిర్మించారు. వాగు ఉప్పొంగితే వరదనీరు పాఠశాలలోకి చొచ్చుకువస్తోంది. వర్షం కురిసినప్పుడల్లా పాఠశాలవైపే నీరంతా ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో పాఠశాల మైదానం బురదగా మారుతోంది. భైంసా మండలం ఇలేగాం, కామోల్‌లో చిరుజల్లులు కురిసినా పాఠశాలల ఆవరణలోకి వెళ్లే పరిస్థితి ఉండదు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు

ప్రాథమిక	533
ప్రాథమికోన్నత	85
ఉన్నత	117
విద్యార్థులు	50,709

ఆధునికీకరణకు ఇచ్చిన నిధులు రూ.24.96 కోట్లు

తప్పని ఇక్కట్లు...

జిల్లాలోని 735 పాఠశాలల్లో 80 శాతానికి పైగా వంటషెడ్లులేవు. దీంతో వర్షాకాలంలో మధ్యాహ్న భోజన పథకంలో ఇబ్బందులు తప్పడంలేదు. వర్షం కురిస్తే భోజన సామగ్రి తడిసిపోతోంది. వంటశాలలను శుభ్రంగా ఉంచాలన్నా శాశ్వత షెడ్లు లేక ఇబ్బందులు తప్పడంలేదు. జిల్లా అంతట మధ్యాహ్న భోజన పరిస్థితి ఇలాగే ఉంది.

అక్కడక్కడా పనులు...

జిల్లాలోని ప్రతీ పాఠశాలలో గతంలో ఉన్న ఎస్ఎంసీలను తొలగించి అమ్మ ఆదర్శ కమిటీలను ఎంపిక చేసింది. పాఠశాలలకు సంబంధించిన మరమ్మతుల ప్రతిపాదనలను పరిశీలించి రూ. 24.96 కోట్ల నిధులు కేటాయించింది. అమ్మ ఆదర్శ కమిటీలతో ఆయా పనులు నిర్వహించారు. కానీ చాలా చోట్ల ఈ పనులు చేశామన్నట్లుగానే ఉన్నాయి. పాఠశాలలకు ఉన్న కిటికీలకు రంధ్రాలను కూడా పూడ్చలేదు. వర్షం కురిసినప్పుడు ఈ కిటికీల నుంచి నీరు లోపలికి వస్తోంది. మరుగుదొడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. జిల్లాలోని 19 మండలాల పరిధిలో 735 ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలలు, 18 కేజీబీవీలు, ఒక ఆదర్శ పాఠశాల ఉన్నాయి. చాలా చోట్ల కేజీబీవీలు సరైన సౌకర్యాలు లేని అద్దె గదుల్లోనే కొనసాగుతున్నాయి. వర్షం కురిస్తే హాస్టళ్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు దృష్టిసారించి ఈ వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు లేకుండా చూస్తాం. ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేస్తున్నారు. రెండేళ్లుగా పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచాం. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల కోసం ప్రభుత్వం రూ.24.96 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో చాలా చోట్ల సమస్యలు తీరాయి. ఎక్కడైన ఇబ్బందులు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేస్తాం.

– రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

కడెం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు బుధవారం 10,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు రెండు వరద గేట్లను ఎత్తి 14,031 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 700 (7.603 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 692.550 (5.804 టీఎంసీలు) అడుగులు ఉంది.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్ఎం రామారావు

లక్ష్మణచాంద: బ్యాంకు ద్వారా అందజేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రామారావు అన్నారు. బుధవారం వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకుల ద్వారా అటు రైతులకు, ఇటు డ్వాక్రా సంఘాల మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామన్నారు. ఖాతాదారులు తప్పనిసరిగా బీమా చేసుకోవాలని సూచించారు. సాధారణ బీమా పథకం కింద ఏడాదికి రూ.వెయ్యి చెల్లిస్తే రూ.20 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. ఏడాదికి రూ.220 చెల్లించిన వారికి రూ.2లక్షల బీమా సౌకర్యం ఉందన్నారు. సుకన్య సంవృద్ధి, అటల్ పెన్షన్ యోజన వంటి అనేక రకాల బీమాలపై అవగాహన కల్పించారు. దీంతోపాటు ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం అబ్దుల్ రెహమాన్, ఎల్డీఎం రామ్ గోపాల్, బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఎస్ఎంవో అభినయరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు అప్పగించాలి



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

భైంసాటౌన్: లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు అప్పగించాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. బుధవారం లబ్ధిదారులతో కలిసి పట్టణ శివారులోని గృహ సముదాయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించి ఏడాది గడుస్తున్నా అప్పగించడం లేదన్నారు. ఇప్పటికీ గృహ సముదాయాలకు కనీస సౌకర్యాలైన మంచినీరు,విద్యుత్, డ్రైనేజీ, రోడ్డు సౌకర్యం కల్పించలేదన్నారు. వెంటనే సౌకర్యాలు కల్పించి ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాము, నయీం, సతీష్, బట్టి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలి



నిరసన తెలుపుతున్న యువకులు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య చేపడుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామ బస్టాండ్ ప్రాంతంలో కూర్చుని శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యువజన నాయకులు అర్గుల రమణ, సప్పల నర్సయ్య మాట్లాడుతూ పచ్చని పంట పొలాల నడుమ కాలుష్యాన్ని వెదజల్లే ఫ్యాక్టరీని నిర్మించవద్దని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేయాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజేశ్వర్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని, ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంలేదని చెప్పడంతో అక్కడినుంచి పోలీసులు వెళ్లిపోయారు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు అప్పగింత


బాలుడిని అప్పగిస్తున్న గ్రామస్తులు

ముథోల్: తప్పిపోయిన పదేళ్ల బాలుడిని తల్లిదండ్రులకు తిరిగి అప్పగించిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చించాల గ్రామంలో గుర్తుతెలియని బాలుడు సంచరిస్తుండగా గమనించిన గ్రామస్తులు దుడ్డు ప్రసాద్, హాజీకర్ దత్తులు బాలుడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడు చెప్పిన వివరాల ప్రకారం భైంసాలోని శాస్త్రినగర్‌కు చెందిన వరుణ్‌తేజ్‌గా గుర్తించారు. వెంటనే భైంసా టౌన్ ఏఎస్సై సుదర్శన్‌కు వివరాలు తెలియజేసి బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన అధికారులు

బోథ్: మండలంలోని బాబేర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొచ్చర జలపాతంలో దూకడానికి ప్రయత్నించగా అటవీశాఖ అధికారులు కాపాడారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పొచ్చర జలపాతం సమీపంలోకి వెళ్లి బట్టలు విప్పిన సదరు వ్యక్తి దూకేందుకు ప్రయత్నించగా గమనించిన అటవీ అధికారులు వెంటనే పట్టుకున్నారు. అనంతరం ఆయన వివరాలు తెలుసుకొని కుటుంబసభ్యులకు అప్పగించారు. వ్యక్తిని కాపాడిన వారిలో అటవీ అధికారి అనిల్, సెక్యూరిటీ గార్డ్ అశోక్ ఉన్నారు.

అటవీ సంపదను కాపాడాలి


ఎఫ్ఆర్వో గణేశ్‌తో ట్రెయినీ ఎఫ్‌బీవోలు

నేరడిగొండ: అటవీ సంపదను కాపాడాలని ఎఫ్ఆర్వో గణేశ్ ట్రైనీ ఎఫ్‌బీవోలకు సూచించారు. దూలపల్లి అకాడెమీ నుంచి 35వ బ్యాచ్‌కు చెందిన 33 మంది ట్రైనీ ఎఫ్‌బీవోలు ఏసీడీ రామ్మోహన్ ఆధ్వర్యంలో బుధవారం కుంటాల జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో వీరికి జలపాతం ప్రాముఖ్యత, అటవీ రక్షణ, సిరిచెల్మ రేంజ్ గురించి వివరించారు. అటవీ సంపదను స్మగ్లర్ల బారి నుంచి ఎలా రక్షించాలో సూచించారు.

తోడేళ్ల దాడిలో ఐదు మేకలు మృతి


మృతి చెందిన మేకలు

తాంసి(బోథ్): మేకల మందపై తోడేళ్లు దాడి చేసి ఐదు మేకలను హతమార్చిన ఘటన మండలంలోని జామిడి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బెల్లపు గంగారం మేకలను రోజువారీగా గ్రామ శివారులోని తన కొట్టంలో ఉంచగా, మంగళవారం రాత్రి పాకలోకి చొరబడిన తోడేళ్లు మేకల మందపై దాడి చేశాయి. ఐదు మేకలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో రెండు మేకలను తోడేళ్లు లాక్కెళ్లాయి. బుధవారం మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ మృతిచెందిన మేకలను పరిశీలించారు. మేకలపై ఉన్న గాయాలను పరిశీలించి తోడేళ్ల దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన మేకలకు చికిత్స చేశారు. మృతి చెందిన వాటి విలువ రూ.70వేల వరకు ఉంటుందని తెలిపారు.

‘విద్యుత్’తో తస్మాత్ జాగ్రత్త!

- అప్రమత్తతే శ్రీరామరక్ష
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయం
- ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి
- విద్యుత్‌శాఖ డీఈ రాజన్న



బెల్లంపల్లి: వర్షాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ డీఈ బి.రాజన్న పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. తడి చేతులతో స్విచ్ బటన్ నొక్కడం, తెగిపోయిన కేబుల్ వైర్‌ను చేత పట్టుకోవడం, జోరువాన కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాన్ని ముట్టుకోవడం, ఇంట్లో ఉన్న విద్యుత్ వైర్లపై తడి బట్టలను ఆరేయడం వంటి చర్యలు ప్రాణాలమీదికి తెస్తాయని, అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలంటున్నారు. విద్యుత్ లైన్ల మీద చెట్ల కొమ్మలు, దుస్తులు, కవర్లు, ఫ్లెక్సీలు పడితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు. విద్యుత్ సమాచారం ఇచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని ఆయన పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ప్రజలు, రైతులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షం కురుస్తున్న సమయంలో లేదా వర్షం తగ్గిన వెంటనే ఎట్టి పరిస్థితుల్లో కరెంట్‌పోల్‌ను ముట్టుకోవద్దు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు కరెంట్ తీగల కింద నిలబడడం, నడవడం చేయకూడదు.
- వర్షం పడుతున్నప్పుడు సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టవద్దు. సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేయాలి.
- విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను ముట్టుకోవద్దు. ఎక్కడైన చెట్ల కొమ్మలు కరెంట్ తీగలకు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటిపైకి ఎక్కి కరెంట్ తీగల సమీపానికి వెళ్లొద్దు. తీగలపై పడిన దుస్తులను కర్రలతో కానీ లోహంతో తయారు చేసిన రాడ్లతో కానీ తీయకూడదు.
- వర్షం పడుతున్న సమయంలో ఆరుబయట ఉన్న విద్యుత్ వైర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మరమ్మతులు చేయరాదు.

ఇళ్లల్లో..

- ఇంట్లో ఉన్న స్విచ్‌లను, ఇతరాత్ర కరెంట్ వస్తువులను పిల్లలు ముట్టుకోకుండా చర్యలు తీసుకోవాలి.
- తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను, వైర్లను ముట్టుకోవద్దు.
- ఇంట్లో ఉన్న వాటర్‌హీటర్, రైస్‌కుక్కర్, స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే ముట్టుకోవాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంటే డిష్ కనెక్షన్ తొలగించడం మంచిది.
- ఇంట్లో ఎక్కడైనా విద్యుత్‌వైరుకు ఇనుప వస్తువులు తగులుతున్నాయో చూడాలి. ఎక్కడైనా ఇనుప వస్తువుకు వైర్లు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి తొలగించే చర్యలు చేపట్టాలి.
- ఇంట్లోకి వచ్చే సర్వీసు వైర్ డ్యామేజ్ అయితే ఆలస్యం చేయకుండా సరి చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు కొత్త సర్వీసు వైర్ ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.
- ప్రతి ఇంట్లోనూ విధిగా ఎర్త్ వైర్ ఏర్పాటు చేసుకోవాలి. అదేతీరుగా ప్రతీ కరెంట్ వస్తువుకు ఎర్త్ వైర్ బిగించుకోవడం శ్రేయస్కరం.

వ్యవసాయ భూముల వద్ద..

- వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు రోజువారీగా అప్రమత్తంగా ఉండాలి. బోరు పంపు వద్ద, వ్యవసాయ బావుల వద్ద తడి చేతులతో స్టార్టర్‌ను తాకొద్దు.
- విద్యుత్ వైర్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడొద్దు. గాలి వీయడం వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్‌లైన్ తీగలు తెగిపడే అవకాశాలు ఉంటాయి. అటువైపు వెళ్లడం కానీ, పశువులను మేపడం కానీ చేయవద్దు.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ తీగలు సవరించడం కానీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెళ్లి తడి చేతులతో ఫ్యూజ్ తీయడం వంటివి చేయవద్దు.

అసలుకే మోసం !


మంచిర్యాల పట్టణంలో యాప్ బాధితులు

- రెట్టింపు డబ్బులంటూ ‘యాప్’లో రూ.కోట్లు వసూళ్లు
- విత్‌డ్రా ఆప్షన్ ఎత్తివేయడంతో బాధితుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పెట్టిన డబ్బులకు రెట్టింపు పొందవచ్చనే ఆశ అసలుకే మోసం తెచ్చింది. ఓ యాప్ సంస్థ తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని ప్రచారం చేసింది. రూ.కోట్లు వసూళ్లు చేసి తిరిగి డబ్బులు తీసుకునే అవకాశం లేకపోవడంతో బాధితులంతా లబోదిబోమంటున్నారు. దేశవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, సాంకేతికతను పెంపొందిస్తామని ‘డేటామీర్’ యాప్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రజలను ఆకర్షించింది. ఇందుకు తమ ప్రొడక్ట్స్ రోబోటిక్స్, ఏఐ, ఇంటెలిజెన్స్, డివిడెండ్లు, డేటా ప్రొడక్ట్స్, ఆయిల్ ఫ్యూచర్స్ ఇలా పలు రకాలుగా చెబుతూ రూ.300నుంచి గరిష్టంగా రూ.2కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలంటూ ఆఫర్లు ఇచ్చింది. వీటిని కొనుగోలు చేస్తే పెట్టిన డబ్బులకు రోజువారీగా వడ్డీ చెల్లించడంతోపాటు బోనస్‌లు, అధిక మొత్తంలో పొందవచ్చని ప్రచారం చేశారు. ఇదంతా నమ్మి ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారస్తులు, గృహిణులు వేలాది మంది డబ్బులు కట్టడం మొదలుపెట్టారు. గత వారంలో ఒక రోబోట్ కొంటే రెండు ఉచితమంటూ ఆఫర్‌లో, పెట్టిన డబ్బులకు సమంగా ఇస్తామని చెబితే ఒక్కొక్కరు రూ.లక్షల్లో కట్టారు. కొందరైతే చేతిలో డబ్బు లేకున్నా, బ్యాంకుల్లో లోన్లు, బంగారం కుదవ పెట్టి, అప్పులు తెచ్చి మరీ చెల్లించారు. ఇలా ఒక్క మంచిర్యాల పట్టణంలో దాదాపు 800మంది వరకు రూ.2 కోట్లు, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో రూ.5కోట్ల వరకు చెల్లించారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలోనూ వేలాదిమంది బాధితులు ఉన్నారు. ఈ నెల 22నుంచి ఎవరికీ డబ్బులు విత్‌డ్రా కాకుండా ఆప్షన్ తీసేవారు. దీంతో యాప్ నిర్వాహకులకు ఫోన్లు, వాట్సాప్ చేసినా ఎలాంటి స్పందన రావడం లేదు. అంతేకాక పెట్టిన డబ్బులు యూపీ, బెంగాల్‌కు చెందిన వేర్వేరే కంపెనీల పేర్లతోనూ ఉన్నాయి. దీంతో బాధితులు త మను చేర్పించిన వారి ఇంటి ముందుకు వెళ్లి గొ డవ చేస్తున్నారు. చివరకు మంచిర్యాల పరిధిలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. బుధవారం సాయంత్రం నుంచి యాప్ నిర్వాహకుల నుంచి పెట్టుబడిదారుల అకౌంట్లు యాక్టివేట్ కావాలంటే మళ్లీ రూ.300నుంచి రూ.26,888 వరకు చెల్లిస్తే గురువారం వరకు యధావిధిగా సాగుతుందని మేసేజ్‌లు వస్తున్నాయి. గత మూడు రోజులుగా స్పందించకుండా మళ్లీ ఇలా మేసేజ్ రావడంపై ఎవరికి నమ్మకం లేక బాధితులు అందరూ ఏకమై వాట్సాప్ గ్రూప్ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఈ యాప్‌లో డబ్బులు పెట్టిన వారంతా పోరాటానికి సిద్ధమయ్యారు. మరోవైపు ‘కొంపముంచిన ‘రెట్టింపు’ ఆశ!’ అనే శీర్షికన ‘సాక్షి’ ప్రచురించిన కథనంతో ఈ యాప్ నిర్వాహకం వెలుగులోకి వస్తోంది.

ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు


పశువుల పాకను ఢీకొట్టిన బస్సు

తాంసి(బోథ్): భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామంలో బుధవారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇంటి ఆవరణలోని పశువుల పాకలో ఉన్న ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సు కరంజి(టి) గ్రామం నుంచి ఆదిలాబాద్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న క్రమంలో అర్లి(టి) గ్రామ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న ఇంట్లోకి దూసుకెళ్లింది. పశువులపాకలో ఉన్న ఎద్దు బస్సు ముందర భాగంలో ఇరుక్కోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి ఆవరణలోని చెట్టును ఢీకొట్టి బస్సు నిలిచిపోయింది. ఇంటి ఆవరణలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మందికి పైగా ప్రయాణికులు సైతం సురక్షితంగా బయటపడ్డారు. కాగా డ్రైవర్ నిర్లక్ష్యంతోనే బస్సు అదుపు తప్పిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబులెన్సు సిబ్బందికి అవార్డులు


అవార్డు అందుకుంటున్న సిబ్బంది

ముథోల్: మండల కేంద్రానికి చెందిన 108 అంబులెన్సు సిబ్బంది ఈఎంటీ పండరి, పైలెట్ నసురుల్లాఖాన్‌లు బుధవారం లైఫ్ సేవియర్ అవార్డులు అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని 108 సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 108 సిబ్బందికి అవార్డులు అందజేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం


నుజ్జునుజ్జయిన ట్రావెలర్ వాహనం

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి 44పై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తృటిలో ప్రాణాపాయం తప్పింది. మధ్యప్రదేశ్‌లోని శివినికి చెందిన తొమ్మిది మంది యువకులు ట్రావెలర్ వాహనంలో దక్షిణ భారతయాత్రకు వెళ్లి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో మండల కేంద్రానికి చేరుకోగానే వర్షం వల్ల ట్రావెలర్ వైపర్లు సక్రమంగా పని చేయకపోవడం.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ముందు వెళ్తున్న లారీని వీరి వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. ట్రావెలర్ ముందు భాగంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

డీఆర్‌డిపో స్థలాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు

బేల: ఐటీడీఏ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్‌కు చెందిన డీఆర్‌డిపో స్థలాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని (ఐటీడీఏ, ఉట్నూర్) గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ మేనేజర్ రాథోడ్ గులాబ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కబ్జాకు గురైన డీఆర్‌డిపో స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ స్థలంలోని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆక్రమణదారులకు సూచించారు. త్వరలోనే కంచె ఏర్పాటు చేసి, ఐటీడీఏ పేరిట ఒక బోర్డు ఏర్పాటు చేయిస్తామన్నారు. తహసీల్దార్ సవాయిసింగ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాజిద్, జీసీసీ అధికారి జాదవ్ రమేశ్ ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన జాతీయ పర్యవేక్షక బృందం


పాఠశాలలో పుస్తకాలు పరిశీలిస్తున్న బృందం

సోన్: రూమ్‌టూరీడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సోన్ మండలం జాఫ్రపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలను జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యులు జెస్సీమేరి ఆధ్వర్యంలో సందర్శించి కార్యక్రమ అమలు గురించి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రూమ్ టూ రీడ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల నోడల్ అధికారి తొడిశెట్టి పరమేశ్వర్, రాష్ట్ర సమన్వయకర్త నితిన్‌కుమార్, బ్లాక్ కోఆర్డినేటర్ గోవర్ధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ సుందర చారి, ఉపాధ్యాయులు కరుణకుమారి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగాపూర్ వాగులో శనివారం రాత్రి టేకం లక్ష్మణ్ వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం సైతం అధికారులు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. నీటి ప్రవాహం వల్ల ఇంకా ఆచూకీ తెలియరాలేదని రెస్క్యూ టీం, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

కూచిపూడి నృత్యంలో చిన్నారి ప్రతిభ


నాట్యమయూరి పురస్కారంతో చిన్నారి ఆరాధ్య


నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారి గంజి ఆరాధ్య హైదరాబాద్‌లో నిర్వహించిన ‘బోనాల సంబరాలు -2024’ కార్యక్రమంలో కూచిపూడి నృత్యం చేసి పలువురిని ఆకట్టుకుంది. నృత్యమాల నాట్యకళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ బోనాల సంబరాలు కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చిన్నారికి ‘నాట్య మయూరి’ పురస్కారంతో పాటు, ప్రశంసాపత్రాన్ని అందించారు. చిన్నారి ఆరాధ్య సాంప్రదాయ నృత్యంలో రాణిస్తుండడంతో నృత్య గురువు నవ్య, పలువురు ఆమెను అభినందించారు.

బురదలో నడిచి వెళ్లి వైద్యసేవలు


బురదలో రతన్‌గూడకు వెళ్తున్న ఏఎన్‌ఎం విజయ

బజార్‌హత్నూర్: మండలంలోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు విద్య, వైద్యానికి దూరం అవుతున్న విషయం తెలిసిందే. గత మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయమయ్యాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వృత్తి పట్ల అంకితభావం గల ఏఎన్ఎం విజయ బుధవారం మండలంలోని టెంబి గ్రామపంచాయతీ పరిధిలోని రతన్‌గూడ, శ్యాంరావ్ గూడ గ్రామాలకు బురదలో కాలినడకన వెళ్లి వైద్య సేవలు అందించారు. చిన్నపిల్లలకు టీకాలు వేశారు. గర్భిణీలకు, వృద్ధులకు మందులు పంపిణీ చేశారు.

అభిమానంతో రావి ఆకుపై కేటీఆర్ చిత్రం



రావి ఆకుపై కేటీఆర్ చిత్రం

తాంసి: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన చిత్రకళాకారుడు గట్టు రాజు కేటీఆర్‌పై అభిమానంతో వినూత్నంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రావి ఆకుపై కేటీఆర్ చిత్రాన్ని గీసి హ్యాపీ బర్త్‌డే కేటీఆర్ అంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశాడు.

వర్షంలో తప్పిపోయిన వృద్ధురాలు


కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: ఓ వృద్ధురాలు వర్షంలో తప్పిపోగా బ్లూకోర్టు పోలీసులు వెతికి పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉండే 70 ఏళ్ల వత్సల బాయి మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి వర్షంలో తప్పిపోయింది. కుటుంబ సభ్యులకు ఆచూకీ తెలియకపోవడంతో అర్ధరాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వృద్ధురాలి ఫొటో సహాయంతో బ్లూకోర్టు సిబ్బంది రాథోడ్ అనిల్, అజార్ ఖాన్, స్పెషల్ పార్టీ పోలీసులు ముత్యం, మహేందర్‌లు పలు కాలనీలలో వెతికారు. గొల్లపేట్ ఎస్సీ కాలనీలో ఓ వృద్ధురాలు వర్షంలో తడుస్తూ ఒంటరిగా ఉందని, ఆమె చెవిటి, మూగ కావడంతో మాట్లాడలేకపోతుందని కాలనీవాసులు ఉదయం 4 గంటల సమయంలో డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు తప్పిపోయిన వృద్ధురాలు వత్సల బాయిగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ


పెందూరు రూప


సిడాం శ్రీజ

ఆదిలాబాద్‌రూరల్: హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో చెన్నైలోని ఎస్ఎస్ఎన్ యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన జాతీయస్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. మండలంలోని చించూఘాట్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పెందూరు రూప, 30 మీటర్ల దూరంలో బంగారు పతకం, సిడాం శ్రీజ, 20 మీటర్ల దూరంలో వెండి పతకాన్ని సాధించారు. గురువారం జరిగే కార్యక్రమంలో వీరు పతకాలను అందుకోనున్నట్లుగా కోచ్ కాత్లే మారుతీ, పీడీ రవీందర్‌లు తెలిపారు. జిల్లా తరఫున ప్రతిభ చాటిన విద్యార్థినులను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, గిరిజన సంక్షేమ శాఖ డీడీ దిలీప్ కుమార్, గిరిజన క్రీడల అధికారి కొరెడ్డి పార్థసారథి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు వారిని అభినందించారు.

సైబర్ క్రైం కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సైబర్‌క్రైమ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రవీణ్ గౌడ్ అనే వ్యక్తి మొబైల్‌కి నాలుగు నెలల కిందట ఒక లింక్ రాగా క్లిక్ చేశాడు. ఈ తరుణంలో సైబర్ నేరగాళ్లు అతనికి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు నంబర్ చెప్పాలనడంతో వెంటనే చెప్పేశాడు. అనంతరం అతని ఖాతా నుంచి రూ.38వేలు డెబిట్ అయ్యాయి. అప్రమత్తమైన అతను 1930 కాల్ చేసి సమాచారం అందించడంతో రూ.25 వేలు హోల్డ్‌లో పెట్టారు. హోల్డ్‌లో పెట్టిన డబ్బులు పొందేందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉండగా బుధవారం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య

సోన్: చెట్టుకు ఉరివేసుకొని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం సాకేర గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై కే.గోపి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలానికి చెందిన గాసెట్ దత్త్రాద్రి (53) కుమారుడు శేఖర్‌తో కలిసి సాకేర గ్రామంలో రోడ్డు పనులు చేస్తుంటాడు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించిన దత్త్రాద్రి తాగిన మత్తులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమయపాలన లోపం.. వైద్యానికి కష్టం!





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల పేద ప్రజల వైద్యానికి పెద్ద దిక్కుగా ఉన్న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 9 గంటలకు విధులకు హాజరు కావాల్సిన వైద్యులు తమ ఇష్టారాజ్యంగా వస్తున్నారు. దీంతో ఆస్పత్రిలోని ప్రధాన ఓపీ విభాగాల్లో సీనియర్ వైద్యుల స్థానంలో జూనియర్‌లే వైద్యసేవలు అందిస్తున్నారు. తమ ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రాధాన్యతనిస్తూ రిమ్స్ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని వారిపై ఆరోపణలు విన్పిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్